క్లుప్తంగా

పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న మీ కోసం సంస్థ అధ్యక్షుడు నాగేశ్వరరావు

కాకినాడ రూరల్: మీ కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో పేదలకు మంగళవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు పిల్లి నాగేశ్వరరావు సేవలను ఈ సందర్భంగా డాక్టరు అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, వెంకీ, రాజు, శ్రీనగేష్, రేలంగి బాపిరాజు అభినందించారు.

కాకినాడలో హీరో కిరణ్ అబ్బవరం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హీరో కిరణ్ అబ్బవరం

కాకినాడ కల్చరల్: ప్రముఖ హీరో కిరణ్ అబ్బవరం 'వినరో భాగ్యము విష్ణు కథ' సినిమా ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం స్థానిక బానుగుడి సెంటర్‌లోని పద్మప్రియ కాంప్లెక్స్‌ను సందర్శించారు. మార్నింగ్ షో విరామ సమయంలో ప్రేక్షకుల నుద్దేశించి ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రేక్షకులు ఆదరించే చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ' అని అన్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో తన చిత్రాలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. చిత్రం యువతకు, వారి తల్లిదండ్రులకు మంచి సందేశం ఇస్తుందన్నారు. తోటి వారితో ఏ విధంగా మెలగాలనే కాన్సెప్ట్‌పై ఈ చిత్ర నిర్మాణం సాగుతోందన్నారు. ఫిబ్రవరి 17న విడుదల కానున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని హీరో కిరణ్ కోరారు. ఈ కార్యక్రమంలో అబ్బు, చిన్ని, భాస్కర్ తదితరుల పాల్గొన్నారు.

మత సామరస్యం పాటించాలి

కాకినాడ రూరల్: కులమతాలకు అతీతంగా అందరూ మత సామరస్యం పాటించాలని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. జాతీయ మత స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రమణయ్యపేట శేషాద్రినగర్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కులమత వైషమ్యాలను రెచ్చగొట్టడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అందరిని సమానంగా చూడడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు జ్యోతిబసు

కాకినాడ సిటీ: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత కమ్యూనిస్టు ఉద్యమ తొలితరం నేత, కార్మిక ఉద్యమ నేత జ్యోతిబసు 13వ వర్ధంతి సందర్భంగా మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జోహార్లు అర్పించారు. పలువురు సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా 23 ఏళ్లు సుదీర్ఘకాలం సేవలు అందించిన జ్యోతిబసు చిరస్మరణీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దువ్వా శేషుబాబ్జీ, కె.సత్తిరాజు, పలివెల వీరబాబు, మలక వెంకటరమణ తదితరులు పాల్గొని జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

8 మంది జూదరుల అరెస్ట్

కరప: అరట్లకట్ట గ్రామశివారున నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై కరప పోలీసులు దాడిచేసి ఎనిమిది మంది జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.13,680 నగదు స్వాధీనం చేసుకున్నారు. కరప ఎస్ఐ ఎస్.రామకృష్ణ కథనం ప్రకారం.. అరట్లకట్ట గ్రామ శివారున పేకాడుతున్నట్టు సమాచారం అందడంతో ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో వెళ్లి గుంపుపై దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న 8 మందిని, వారి వద్ద ఉన్న నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కాకినాడ కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. చెందుర్తి సెంటర్ వద్ద మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరిని ఐషర్ వ్యాన్ ఢీకొట్టడంతో శంఖవరం మండలం పాత వజ్రకూటానికి చెందిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలైనట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ముగిసిన కావమ్మ తిరునాళ్లు

సామర్లకోట: స్థానిక రజకపేటలో ఏలేరు కాలువ ఆవలి వైపు ఉన్న కావమ్మ ఆలయం వద్ద సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించిన తిరునాళ్లు మంగళవారం ముక్కనుమతో ముగిశాయి. పట్టణ పరిధిలోని అనేక గ్రామాల రైతులు, వ్యవసాయకూలీల కుటుంబాల వారు కావమ్మ, మారెయ్యలను దర్శించుకున్నారు.

సా..గుతూ!

- ఆలస్యమవుతున్న రబీ
- పూర్తి కాని దమ్ములు, నాట్లు
- కరప మండలంలో 70 శాతం నాట్లు పూర్తి
- ఇలాగైతే చివరిలో ఇబ్బందులు

కరప: మండల శివారు ప్రాంతాల్లో రబీ సీజన్ నేటికీ పూర్తి కాలేదు. రైతులు ఇప్పటికీ దమ్ములు చేసి, వెద జల్లుకొంటున్నారు. ఏటా డిసెంబరు నెలాఖరుకల్లా రబీ నాట్లు పూర్తి చేసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీచేసే వారు. ఈ ఏడాది దాళ్వా సీజన్‌లో ఎప్పటి వరకు సాగునీందిస్తారు? కాలువల మూసివేత ఎప్పుడనేది చెప్పకపోవడంతో నేటికీ సాగు పనులు కొనసాగుతున్నాయి. ఇలాగైతే సీజన్ చివరిలో సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు అంటున్నారు.

కరప మండలంలో 14,898 ఎకరాల్లో వరిసాగవుతుంది. ఈ మండలంలో కాలువ శివారు, మెరక భూములు ఉంటాయి. మిగిలిన ప్రాంతాల కంటే మండల పరిధిలో వరినాట్లు రెండు వారాలు ఆలస్యంగా జరుగుతుంటాయి. దాళ్వా పనులు ముమ్మరంగా చేపట్టే సమయంలో పెథాయ్ అల్పపీడనం ప్రభావంతో కొద్దిపాటి వర్షాలు పడటంతో ఆ పనులకు ఆటంకం ఏర్పడింది. అప్పటికే వెదజల్లుకున్న పొలాల్లో వర్షం నీరు నిలబడి మొలకశాతం దెబ్బతినగా, పల్లపు భూములు ముంపునకు గురై విత్తనాలు దెబ్బతిన్నాయని, మళ్లీ దమ్ము చేసి జల్లుకోవాల్సి వచ్చిందని రైతులు తెలిపారు. సాగునీటికి ఇబ్బంది లేకపోయినా శివారు, మెరక ప్రాంత భూముల్లో దాళ్వా సాగు ఆలస్యమైందని యండమూరు, జి.భావారం, వేళంగి, వేములవాడ, పెదకొత్తూరు, వాకాడ, వలసపాకల, కరప, గొడ్డటిపాలెం, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం తదితర గ్రామాల రైతులు తెలిపారు. కాలువశివారు భూములు కావడంతో ఇప్పుడే దమ్ములు చేసి, వెదజల్లుకుంటున్నట్టు ఆయా గ్రామాల్లోని రైతులు అంటున్నారు. ఆలస్యమైన ప్రాంతాల్లో స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1153, 1156 రకాలను సాగు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. గత ఏడాది బొండాలు(ఎంటీయూ 3626) రకానికి ధర బాగుండడంతో ఈ ఏడాది అధిక శాతం రైతులు బొండాలు రకం వేసుకోగా, మరి కొంతమంది స్వల్పకాలిక రకాలను సాగు చేసుకుంటున్నారు. వెదజల్లు పద్ధతి అనుసరిస్తే సమయం కలిసి వస్తుందని రైతులు వెదజల్లుకు ప్రాధాన్యమిస్తున్నారు. సాధారణంగా ఊడ్చే పొలాలకంటే వెదజల్లిన పొలాలు రెండువారాలు ముందుగా కోతకు వస్తుందని రైతులు తెలిపారు.



యండమూరులో ఆలస్యంగా వెదజల్లిన పొలం



గొర్రిపూడిలో ముదరగా వెదజల్లిన పంటపొలం

నెలాఖరుకు..

మండలంలో రబీనాట్లు ఇంత వరకు 70 శాతం పూర్తయ్యాయి. వాకాడ, వేములవాడ, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, జి.భావారం, యండమూరు గ్రామాల్లో సాగు ఆలస్యమైంది. ఈనెలాఖరు నాటికి రబీనాట్లు పూర్తవుతాయి. ఆలస్యమైన ప్రాంతాల్లో స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ-1153, ఎంటీయూ-1156 రకాలు సాగు చేసుకోవాలి. వెదజల్లడం వల్ల సమయం కలిసి వస్తుంది. కలుపు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

– ఏవీ రాజేష్, కరప మండల వ్యవసాయాధికారి



శివారు ప్రాంతం కావడంతో ఆలస్యమైంది

దాళ్వాలో ముందుగా వేయడం వల్ల ఎలుకల బాధ ఎక్కువగా ఉంటోంది. సాగునీటి ఎద్దడి లేకపోయినా శివారు ప్రాంతం కావడం ఒక కారణమైతే, ఎలకకొట్టుడు తగ్గించుకునేందు కూడా వరినాట్లు ఆలస్యం చేశాం. చివరిలో ఒక నీటి తడికి ఇబ్బంది వస్తే ఇంజిన్‌తో సాగునీరు తోడుకోవాల్సి ఉంటుంది.

– నున్న వెంకటేశ్వరరావు, రైతు, విజయరాయుడుపాలెం



ఇరు వర్గాల మధ్య వివాదం

- ఒకరిపై కత్తితో దాడి



కత్తిపోటుకు గురైన ఉపసర్పంచ్ కందా వెంకటరాజు అలియాస్ చినబాబు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో ఇరు వర్గాల మధ్య వివాదం చెలరేగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో ఒక వర్గం దాడిలో మరో వర్గంలోని తండ్రీ కొడుకులకు కత్తి గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సర్పంచ్, ఉప సర్పంచ్ వర్గాల మధ్య కొంత కాలంగా వివాదం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి జాతీయ రహదారిలో వన్నెపూడి సెంటర్ వద్ద ఆ వర్గాల మధ్య ఘర్షణ తలెత్తడంతో సర్పంచ్ వర్గానికి చెందిన కందా చక్రధరరావు కత్తితో దాడి చేయడంతో ఉపసర్పంచ్ కందా వెంకటరాజు అలియాస్ చినబాబు, అతని కొడుకు కందా శ్రీరామమూర్తికి గాయాలయ్యాయి. వారిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఎస్సై వినయ్ ప్రతాప్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరపలో క్రికెట్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కరప: కరప హైస్కూల్ క్రీడామైదానాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ గ్రౌండ్‌గా అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం రాత్రి యాళ్ల వెంకట్రాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్, నక్కా భాస్కరమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన నాకౌట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యతోపాటు క్రీడలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. కరప క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధికి సీఎంతో మాట్లాడి అవసరమైన నిధులు మంజూరుకు కృషిచేస్తానన్నారు. సంక్రాంతి సందర్భంగా ఏటా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న సీఏకే అధ్యక్షుడు దేవు మధువీరేష్‌ను ఆయన అభినందించారు.

ఎమ్మెల్సీ చిక్కాల మాట్లాడుతూ కరపలో మూడు దశాబ్దాలుగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్న సీఏకే అధ్యక్షుడు మధువీరేష్‌ను అభినందించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి,సత్తిబాబు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఏపీ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి రమేష్‌లు మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. క్రికెట్ టోర్నమెంట్ విన్నర్‌గా గురజనాపల్లి జట్టు, రన్నర్‌గా కరప ఫ్రెండ్స్-11 జట్లకు మెమెంటోలు, కప్‌లు అందజేశారు. వివిధ కేటగిరీలలో ప్రతిభచూపిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. వివిధ పార్టీల నాయకులు గరగ జెమ్మీ, డాక్టర్ బొండా సూర్యారావు, డాక్టర్ ఎం.స్వరూప్, నక్కా సత్తిబాబు, వడ్డి మణికుమార్, కుంపట్ల విజయ్‌కుమార్, శివ, టి.చందు, డి.స్వాతి, శేషుకుమారి, కడలి ఈశ్వరి, నక్కా వెంకటేశ్వర్లు, జిల్లా క్రికెట్ అండర్-19 జట్టు సెలెక్టర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



గురజనాపల్లి జట్టుతో ఎమ్మెల్యే కన్నబాబు, వివిధ పార్టీల నాయకులు

ముగిసిన కరప క్రికెట్ టోర్నమెంట్

- విజేత గురజనాపల్లి టీమ్
- రన్నర్‌గా కరప ఫ్రెండ్స్-11 టీమ్

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కరప(సీఏకే) అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ క్రికెట్ ప్లేయర్ దేవు మధువీరేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాళ్ల వెంకట్రాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. టోర్నీ పోటీల్లో 30 జట్లు పాల్గొనగా ఫైనల్స్ పోటీలో గురజనాపల్లి టీమ్ కరప ఫ్రెండ్స్-11 జట్ల మధ్య జరిగింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కరప ఫ్రెండ్స్-11 టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 115 పరుగులు చేసింది. తర్వాత ఛేజింగ్‌కు బరిలోకి దిగిన గురజనాపల్లి జట్టు ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అధిగమించి విజేతగా నిలిచింది. గురజనాపల్లి జట్టు విజేతగా, కరప ఫ్రెండ్స్-11 జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. అంతకు ముందు నక్కా భాస్కరమ్మ జ్ఞాపకార్థం నాకౌట్ పోటీలు నిర్వహించారు. యాళ్ల వెంకట్రాజు మెమోరియల్ క్రికెట్‌టోర్నమెంట్ విజేత జట్టు అయిన గురజనాపల్లి టీమ్‌కు దేవు సూర్యనారాయణమూర్తి(సూరిబాబు) జ్ఞాపకార్థం రూ.రెండు లక్షలు విలువ చేసే గోల్డ్‌కప్ రోలింగ్ ట్రోఫీని గెలుచుకుంది.

గోవాలో స్మార్ట్ సిటీల వర్క్‌షాపు

- పాల్గొననున్న కాకినాడ కమిషనర్

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈనెల 23, 24 తేదీల్లో గోవాలో డేటా, టెక్నాలజీ వర్క్‌షాపు జరగనుంది. దేశంలోని 100 స్మార్ట్ సిటీ నగరాలకు సంబంధించిన సీఈఓలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. స్మార్ట్ సిటీ మిషన్ డైరెక్టర్ కూనల్‌కుమార్ పర్యవేక్షణలో ఈ సదస్సు జరగనుంది. కాకినాడ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ సీఈఓ, ఎండీ కె.రమేష్ ఈ సదస్సుకు హాజరుకానున్నారు. అనేక స్మార్ట్‌సిటీ నగరాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) పనితీరు, ప్రయోజనాలు, మరింత సమర్థంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గోవా వేదికగా సీఈఓలు అభిప్రాయాలు పంచుకోనున్నారు. సదస్సు ద్వారా వ్యక్తమైన అభిప్రాయాలను క్రోడీకరించి ఐసీసీసీలను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడమే ఈ వర్క్‌షాపు ప్రధాన ఉద్దేశం. కాకినాడలో రూ.98 కోట్లతో ఏర్పాటు చేసిన ఐసీసీసీ సెంటర్ అత్యంత సమర్థంగా పనిచేస్తోంది. స్మార్ట్‌సిటీలో ఎంపిక చేసిన ముఖ్యమైన 350 ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవన్నీ కమాండ్ కంట్రోల్‌సెంటర్‌కు అనుసంధానంగా పనిచేశాలా రూపకల్పన చేశారు. కాకినాడ సిటీలోని ట్రాఫిక్ లైట్లను కూడా ఐసీసీసీ పర్యవేక్షిస్తోంది. దాదాపు 470 ప్రాంతాల్లో వైఫై నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తెచ్చారు. వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియచెప్పేలా నగరంలో 12 చోట్ల ఎన్విరాన్మెంట్ సెన్సార్లు కూడా పనిచేస్తున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన పబ్లిక్‌కాల్ సెంటర్ ప్రజలకు ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తోంది. వీటన్నింటిని గోవాలో జరిగే వర్క్‌షాపులో స్మార్ట్ సిటీ సీఈఓ రమేష్ వివరించనున్నారు.

రోటరీ సేవలను ప్రోత్సహించాలి

బోట్‌క్లబ్: రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించాలని కాకినాడ సీ పోర్టు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కేవీ రావు అన్నారు. సీ పోర్టు సీఎస్సార్ ఫండ్స్ రూ.30 లక్షలతో కొనుగోలు చేసిన మల్టీపర్పస్ బ్లడ్ కలెక్షన్ అంబులెన్స్‌ను మంగళవారం ఆయన లాంఛనంగా ప్రారంభించి రోటరీబ్లడ్‌బ్యాంకు చైర్మన్ టీవీ బాలకృష్ణ, రోటరీగోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు జివి కృష్ణప్రకాష్‌లకు అందించారు. ఈ సందర్భంగా రోటరీహాలులో నిర్వహించిన సమావేశంలో కేవీ రావు మాట్లాడుతూ క్లబ్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ద్వారా ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. కాకినాడ సీపోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.మురళీధర్ మాట్లాడుతూ బ్లడ్‌బ్యాంకుల నిర్వహణ ఈ మధ్య కాలంలో గణనీయంగా పెరిగాయన్నారు. రక్తదానంపై ఇంకా సమాజంలో అనేక అపోహలు ఉండడం దురదృష్టకరమన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించి కనీసం 100 యూనిట్ల బ్లడ్ బ్యాగ్స్ అందజేస్తామన్నారు. బ్లడ్ బ్యాంకు చైర్మన్ టీవీ బాలకృష్ణ మాట్లాడుతూ మల్టీపర్పస్ బ్లడ్ కలెక్షన్ అంబులెన్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాలతోపాటు ప్రాథమిక ఆరోగ్య చికిత్స శిబిరాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం కేవీ రావు, మురళీధర్‌లను క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్‌రావు, క్లబ్ కార్యదర్శి వడ్డాది ఆదిత్య, బ్లడ్ బ్యాంకు కమిటీ కార్యదర్శి చార్మినార్ వర్మ, క్లబ్ కోశాధికారి గోవిందరాజు పాల్గొన్నారు.



మల్టీపర్పస్ బ్లడ్ కలెక్షన్ అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కాకినాడ సీపోర్టు చైర్మన్ అండ్ ఎండీ కేవీ రావు

భూహక్కు పత్రాల పంపిణీ వేగవంతం చేయండి

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష రీసర్వేకు సంబంధించి కాకినాడ డివిజన్‌లోని తహసీల్దార్లతో ఆర్డీవో బీవీ రమణ మంగళవారం డివిజనల్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ డివిజన్‌లో జగనన్న శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీకి సంబంధించి 42,637 భూహక్కు పత్రాలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 28,880 భూహక్కు పత్రాలు పంపిణీ చేశామన్నారు. ఈ పత్రాలు ఈకేవైసీతో అనుసంధానం చేసి పంపిణీ వేగవంతం చేయాలని తహసీల్దార్లను ఆర్డీవో వెంకట రమణ ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్డీవో కార్యాలయపు పరిపాలనాధికారి వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకట రమణ

మహాశివరాత్రి ఏర్పాట్లపై 19న సమావేశం

సామర్లకోట: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తుల నుంచి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరించడానికి ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు ఆలయ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసినట్టు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో ట్రస్టు బోర్డు సభ్యులు, భక్త సంఘం, దీపారాధన సంఘం సభ్యులు, రైతులు పాల్గొని సలహాలు ఇవ్వాలన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

సామర్లకోట: పెద్దాపురం మండలం గుడివాడ, కాండ్రకోట రోడ్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పరామర్శించారు. పనసపాడు గ్రామ పరిధిలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని మంగళవారం పరామర్శించి క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు. ఈ మేరకు డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించే విధంగా ఏర్పాటు చేశారు.

వ్యక్తిపై కేసు

కొత్తపల్లి: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 15వ తేదీన వాకతిప్పకు చెందిన పెదపాటి బాబులు పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో నడిచి వెళుతుండగా గోర్స జంక్షన్ వద్ద ఉన్న సత్తెమ్మతల్లి గుడి సమీపంలో మోటర్ సైకిల్‌పై ఒక వ్యక్తి వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బాబులకు గాయాలయ్యాయి. దీనిపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక

కొత్తపల్లి: మండలంలోని మూలపేట జెడ్పీ పాఠశాలలో 1991-92 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పొన్నాడ శివారు తీర ప్రాంతంలో ఆత్మీయంగా కలుసుకున్నారు. రాజకీయ రంగంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ అయిన వారిని విద్యార్థులు సత్కరించారు. ఇకపై ఏటా ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ కలయికలో పూర్వ విద్యార్థులు, పొన్నాడ సర్పంచ్ బండి రాణి, వైఎస్సార్ సీపీ నాయకుడు గోగు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం

- 20 నుంచి మూడు రోజులు గంధోత్సవం
- మత సామరస్యానికి ప్రతీకగా పెద్దాపురంలో ఉరుస్ ఉత్సవం

పెద్దాపురం: సుమారు 354 సంవత్సరాల చరిత్ర కల్గిన పట్టణ శివారులోని హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా(తొమ్మిది మూరల సాహెబ్) మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉరుస్ గంధోత్సవాన్ని ఈనెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు దర్గా కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా 20న దర్గా వద్దకు మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు విచ్చేసి బాబా ఆశీస్సులు పొందుతారు. ముస్లింలు, అంజుమన్ వ్యవస్థాపకుడు దివంగత ఎంఏ సత్తార్ ఇంటి వద్ద నుంచి 20వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు గంధం ఊరేగింపు మేళాతాళాలతో బయల్దేరి దర్గా చేరుకుంటుంది. సాయంత్రం ఏడుగంటలకు హైదరాబాద్ వారిచే తయారు చేయబడిన పచ్చటి వస్త్రాన్ని బాబా వారికి అలంకరించి ఖురాన్ పఠనంతో గంధాన్ని బాబా సమాధికి పూస్తారు. బాబాకు పూసిన గంధాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీకరిస్తారు.

పార్టీ రహితంగా దాతల సహకారంతో..

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉరుస్ ఉత్సవాన్ని ఏటా పార్టీ రహితంగా ప్రజల సహకారంతో వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. దర్గాకు సంబంధించి ఎటువంటి ఆస్తులు లేకపోవడంతో దాతల సహకారంతో పై కప్పు ఏర్పాటు, దర్గా వద్ద మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. దాతలు, ప్రజల సహకారంతో ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగ తాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల బాబు తదితరులు ప్రారంభిస్తారు. 22వ తేదీ వరకు గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించి మూడవ రోజు భారీ అన్నదానాన్ని ఏర్పాటు చేస్తారు. దర్గా సభ్యులు ఎండీ లాయక్ అలీ, బాబూలాల్, ఆషిక్ అలీ, రఫీ, సబ్బీర్, జలీల్, బాజి, రిజ్వాల్, ఇర్షాద్ అలీ, హఫీజ్, జాకీర్‌ల ఆధ్వర్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు మూడు రోజుల పాటు భిన్నత్వంలో ఏకత్వం మాదిరిగా అన్ని మతాల వారితో కలిపి వివిధ సేవా కార్యక్రమాలు, పేదలకు వస్త్రదానం నిర్వహించి ఉరుస్ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 20వ తేదీ రాత్రి 9 గంటలకు రాజమహేంద్రవరం వారిచే మిమిక్రీ ట్రాక్, మ్యూజికల్ ప్రోగ్రాంతో పాటు ఖవ్వాలీ ఘనంగా నిర్వహిస్తారు.



ఉరుస్ గంధోత్సవానికి సిద్ధమవుతున్న తొమ్మిది మూరల సాహెబ్ సమాధి ఇదే

బీచ్‌లో జన సందడి



సందర్శకులతో కిక్కిరిసిపోయిన బీచ్

- సాగరతీరానికి పోటెత్తిన జనం
- స్తంభించిన ట్రాఫిక్

కాకినాడ రూరల్: కాకినాడ బీచ్ జనసంద్రమైంది. సూర్యారావుపేట వద్ద ఎన్టీఆర్ బీచ్‌కు వేలాదిగా సందర్శకులు తరలివచ్చారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి సొంత ఊర్లకు వచ్చిన వారందరూ బీచ్‌లో సరదాగా గడిపేందుకు తరలిరావడంతో కిక్కిరిసింది. లైట్‌హౌస్ నుంచి నేమాం వరకు సందర్శకులతో నిండిపోయింది. మధ్యాహ్నం నుంచి బీచ్‌రోడ్డులో రద్దీ నెలకొనగా కాకినాడ రూరల్, ట్రాఫిక్, మెరైన్ పోలీసులు సందర్శకులకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సాయంత్రం తిరుగు ప్రయాణ సమయంలో బీచ్‌రోడ్‌లో వాహనాల రద్దీతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో గంటకు పైగా సందర్శకులు ట్రాఫిక్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. రూరల్ సీఐ శ్రీనివాస్, తిమ్మాపురం ఎస్సై నాగార్జునరాజు, ట్రాఫిక్ సీఐ చైతన్య కృష్ణ తదితరులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేశారు.

ఏడీబీ రోడ్డు పాన్‌షాపులో అగ్ని ప్రమాదం

సామర్లకోట: స్థానిక పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని పాన్ షాపులో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. పెద్దాపురానికి చెందిన వాసు రాక్ సిరామిక్స్ ఎదురుగా పాన్‌షాపుతో కలిపి చిన్న హోటల్ ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాడు. ముక్కనుమ పండగ కావడంతో వ్యాపారితో పాటు కూలీలు కూడా సెలవు తీసుకున్నారు. దాంతో షాపులో ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. గుర్తు తెలియని వ్యక్తులు పాన్‌షాపునకు నిప్పు పెట్టారనే విమర్శలు ఉన్నాయి. షాపునకు అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న రాక్ సిరామిక్స్ సిబ్బంది ఫ్యాక్టరీలోని అగ్నిమాపక వాహనం ద్వారా మంటలు అదుపు చేశారు.



మంటలు అదుపు చేస్తున్న రాక్ సిరామిక్స్ సిబ్బంది